క్లుప్తంగా

ఫోన్‌లో వై.ఎస్.జగన్ పరామర్శ

తాడికొండ: వైఎస్సార్ సీపీ నాయకులు, తుళ్లూరు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్ తల్లి బత్తుల లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఫోన్‌లో ఆయన్ని పరామర్శించారు. తల్లి మృతి చెందడానికి గల కారణాలు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

మురుగు కాలువల్లో చెత్త తొలగింపు



ఆత్మకూరు(మంగళగిరి): నగర పరిధిలోని ఆత్మకూరు ఎస్సీ కాలనీలో సమస్యలను అధికారులు పరిష్కరించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో 'ఎస్సీ కాలనీలో సమస్యల తిష్ట' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఉదయాన్నే పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లోని చెత్తను తొలగించి శుభ్రపరచారు. అధికారులు స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించారు. మురుగు కాలువలన్నీ శుభ్రపరచి చెత్తను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ సాక్షి దినపత్రికకు ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

దుగ్గిరాల: మండల పరిషత్ కార్యాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. దుగ్గిరాల ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులు పాల్గొని సమీక్షపై చర్చలు జరిపారు. ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. దుగ్గిరాల జడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ మాట్లాడుతూ.. మండలంలోని 16 గ్రామాల్లో నగేరా ద్వారా వివిధ పనులు నిర్వహించామని.. వాటి అంచనా విలువ రూ.5.90 లక్షలని అన్నారు. ఎంపీపీ షేక్.జబీన్, తహసీల్దారు ఐ.సునీత, చంద్ర మోహన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గంజాయి కేసు నిందితులను కోర్టుకు తరలింపు



మంగళగిరి టౌన్: గంజాయి తరలింపు కేసులో నిందితులైన ఇద్దరి వ్యక్తులను పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరిచినట్లు పట్టణ సీఐ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెనాలి పట్టణానికి చెందిన సన్నీపాల్, జాషువాలు పవన్, మణికంఠ అనే ఇద్దరు వ్యక్తుల దగ్గర నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. సన్నీపాల్, జాషువాలపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. పట్టణ ఎస్ఐ హరిబాబు, క్రైమ్ సిబ్బంది బాబూరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విట్ కళాశాలలో ల్యాప్‌టాప్‌ల చోరీ

తాడికొండ: వీఐటీ ఏపీ కళాశాలలో నాలుగు ల్యాప్‌టాప్‌లు చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. విట్ కళాశాలలో ఈ నెల 22వ తేదీన బాలుర వసతి గృహంలో నాలుగు ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయ్యాయి. దీనిపై సీసీ ఫుటేజీలు పరిశీలించారు. అనంతరం శుక్రవారం తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో విద్యార్థి ఎం.ఆదిత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఏసురత్నం ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

ఫిరంగిపురం: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని పంచాయతీరాజ్ డీఈఈ కొండయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఈ అజయ్‌కుమార్, ఏఓ రవిబాబు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, సచివాలయం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ షేక్.ఘన్‌సైదా, మండల ప్రెసిడెంట్ పవన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే–డ్రైడేను నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ప్రజలను కోరారు. మురుగు నిలువ ఉంటే దోమల ఉద్ధృతి పెరుగుతుందని.. దీని ద్వారా జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని తెలియజేశారు.

సెలవులిచ్చారు.. పిల్లలు జాగ్రత్త !

- ఈత సరదాలకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న వైనం
- వేసవి సెలవుల్లో పిల్లలపై నిఘా



పెదకాకాని వద్ద ఉద్ధృతంగా గుంటూరు ఛానల్(కొత్తకాలువ)

పెదకాకాని: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. దీంతో పిల్లల ఆనందాలకు అవధులు లేవు. వేసవి సెలవులు కావడంతో పుస్తకాల బ్యాగులను మూలన పడేసి ఎంచక్కా ఆటల బాట పడుతుంటారు. ఎండల సమయంలో కాలువలను చూడగానే పిల్లల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది. ఈ ఆనందాల వెంటే విషాదాలు కూడా దాగి ఉన్నాయి. తమకు ఈత రాదనే విషయం కూడా మరిచి నీటి కుంటలు, చెరువులు, బావులు, కాలువల్లో లోతు తెలియక దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో మండే ఎండలో చిన్నారులను కంటికి రెప్పలా చూసుకోవాల్సి బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. సరదా ఈతలతో జరిగే ప్రమాదాలపై పిల్లలకు అవగాహన పెంచాలి.

గతంలో జరిగిన ప్రమాదాలు..

మండలంలోని నంబూరు, పెదకాకాని, తక్కెళ్లపాడు, రామచంద్రపాలెం గ్రామాల నుంచి ప్రవహిస్తున్న గుంటూరు ఛానల్(కొత్తకాలువ) ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ కాలువలోనే నంబూరు వద్ద ఈ ఏడాది మార్చి 7న దాసరి జాషువ(13) అనే బాలుడు తన మిత్రులతో కలిసి దిగాడు. కాలువ లోతు ఎక్కువ ఉండడంతో బాలుడు ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. గాలించి బయటకు తీసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ నెల 1వ తేదిన తక్కెళ్లపాడు వద్ద ఈత కొట్టేందుకు దిగిన షేక్ జాని(18) తన మిత్రుల ముందే కాలువలో మునిగిపోయాడు. చుట్టుపక్కల వారికి సైతం ఈత రాకపోవడంతో యువకుడు కన్నవారికి కడుపుకోత మిగిల్చాడు. గతంలోనూ ఇటువంటి ప్రమాదాలు కోకొల్లలు. గ్రామ శివారుల్లో బావులు, చెరువులు, కాలువలు, కుంటలు ఉంటే పిల్లలను అటుగా వెళ్లకుండా జాగ్రత్తలు పడాలి. ఒకవేళ సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తగిన ఏర్పాట్లతో పెద్దలు సైతం పక్కన ఉండేలా చూసుకోవాలి.

ఎలక్ట్రానిక్ వస్తువులతోనూ ముప్పే..

వేసవి సెలవులు కావడంతో పిల్లలు భోజనం తరువాత ఎండలో తిరగకుండా పడుకునేలా చూడాలి. ఆ తరువాత ఇంటి పరిసరాల్లో, చెట్ల నీడలో ఆడుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. పాత కాలంలో ఆడుకునే ఆటలను పిల్లలకు తెలియజేసి ఆసక్తి కలిగించాలి. అలా కాకుండా ఇంట్లో నిత్యం టీవీ, కంప్యూటర్, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లు, వీడియో గేమ్‌లు వంటివి అలవాటు చేస్తే పిల్లల్లో దృష్టి లోపం తలెత్తే అవకాశం ఉందని నేత్ర వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అవగాహన కల్పించాలి..

తల్లిదండ్రులు పిల్లల కోసం అధిక సమయం కేటాయించాలి. ఖాళీ సమయాల్లో పిల్లలు విజ్ఞాన, వినోదానికి సంబంధించిన పుస్తకాలు చదివేలా అలవాటు చేయాలి. ఇంటిలోనే ఉంటూ నీడ పాటున ఆటలు ఆడుకునేలా చూడాలి. పిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు కచ్చితంగా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి బయటకు వెళ్లేలా వారికి అవగాహన కల్పించాలి.



నంబూరు వద్ద గల్లంతయిన వారి కోసం గాలిస్తున్న దృశ్యం(ఫైల్ ఫొటో)

ఎల్‌టీపీలుగా నమోదు చేసుకోండి

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేసేందుకు అర్హత కలిగిన వారు ఎల్‌టీపీ(లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్)గా నమోదు చేసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్వీయ ధృవీకరణ పత్రంతో ప్లాన్లు దాఖలు పరిచి ఆన్‌లైన్ విధానంలో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేసేందుకు ఐ.టి.ఐ/డిప్లమో, డిగ్రీ సివిల్ ఇంజనీరింగ్‌లో అర్హత కలిగిన అభ్యర్థులు ఎల్‌టీపీలుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఎంటీఎంసీ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగాన్ని సంప్రదించాలని అన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కమిషనర్ కోరారు.

రైతులకు ఆర్థిక సహాయం

బేతపూడి(మంగళగిరి): నగర పరిధిలోని బేతపూడిలో ఇటీవల ప్రమాదవశాత్తూ గేదెలు మృతి చెందగా ఆ రైతులకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహాయం అందజేశారు. పాడి గేదెలు మృతి చెందడంతో పలువురు పాడి రైతులు నష్టపోయారని టి.డి.పి నాయకులు తెలుపడంతో మంత్రి లోకేష్ రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం టి.డి.పి నాయకులు బాధిత రైతులకు సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, సంకా బాలాజీ గుప్తా, తోట పార్థసారథి, నందం అబద్ధయ్య, జువ్వాది కిరణ్ చందు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ స్నేహరాజ్



దుగ్గిరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

మంగళగిరి టౌన్: మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ స్నేహరాజ్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి, ఎయిమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డాక్టర్లు, మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది సైదులు, సాగర్, శ్రీనివాసరావు, నరసింహరావు, మంగళగిరి పట్టణ పరిధిలోని మూడు అర్బన్ హెల్త్ సెంటర్ల సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగళగిరి: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఎయిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, పి.హెచ్.సిల వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. యు.పి.హెచ్.సి హెల్త్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బందితో మలేరియా దినోత్సవ ర్యాలీని వైద్యులు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యురాలు శ్వేత, సీహెచ్‌వో వెంకటరమణ, పీహెచ్ఎస్ షేక్.అబ్దుల్‌రెహమాన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దుగ్గిరాల: మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని దుగ్గిరాలలో శుక్రవారం వైద్యాధికారి ఇందిర ర్యాలీ నిర్వహించారు. 2027 నాటికి మలేరియా కేసులు తగ్గించాలని 2030 నాటికి దేశంలో పూర్తిగా మలేరియా నిర్మూలించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్రైవర్స్ కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కుంచనపల్లిలో అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. మలేరియా నిర్మూలనపై పలువురు వైద్యులు మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శాంతికుమారి, డాక్టర్ మానస, డాక్టర్ నాగేంద్రబాబు, సీహెచ్‌వో గురుకుమార్, సుధీర్‌కుమార్, సూపర్‌వైజర్ శివశంకర్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఉమాదేవి, వైద్య సిబ్బంది, ఎ.ఎన్.ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: మలేరియా రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మంగళగిరి నగర పరిధిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సిబ్బంది దిల్షా, వరలక్ష్మి, ధనలక్ష్మి, మలేరియా డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

కంతేరులో దళిత బాలురపై జనసేన నాయకుల దాడి



కంతేరు(తాడికొండ): బాదంపాలు తాగేందుకు కూల్ డ్రింక్ దుకాణం వద్దకు వెళ్లిన దళిత బాలురపై జనసేన నాయకులు దాడి చేసిన ఘటన మండలంలోని కంతేరులో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. కంతేరు గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు వలపర్ల కల్పన కుమారుడు వలపర్ల భాను భాస్కర్ తొమ్మిదో తరగతి, బి.శశికిరణ్(16), కర్రి.రాజశేఖర్(16) ముగ్గురు యువకులు బాదంపాలు తాగేందుకు సెంటర్‌లోని కూల్ డ్రింకు దుకాణం వద్దకు వెళ్లారు. అక్కడ జెట్టి తిరుమలనాయుడు, జనసేన నాయకుడు యువకులను అనవసరంగా కలుగచేసుకొని ఇక్కడకు ఎందుకు వచ్చారురా , పిల్ల నాకొడకల్లారా, మాల నా కొడుకులు, మాసెంటర్‌కు వచ్చి రోడ్లపై తిరిగేది ఏందిరా అంటూ దాడిచేసి గాయపరిచాడు. ఈవిషయాన్ని బాలురు ఇంటికెళ్లి తల్లిదండ్రులకు చెప్పగా, ప్రశ్నించేందుకు వెళ్లిన వారిపై తీవ్రంగా దాడి చేసి కులంపేరుతో దూషించి కొట్టడంతో గుంటూరు జీజీహెచ్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. తిరుమలరావుతో పాటు అతడి భార్య రోహిణి, గులకవరపు గోపి నాయుడు, సుధాసాయి సత్యనాయుడు, బుర్రి గోపినాయుడు, మరి కొంత మంది మూకుమ్మడిగా దాడి చేసి మీరు మా దగ్గరకు వచ్చి ఫిర్యాదు చేసేంతస్థాయికి ఎదిగారా, నాకొడకల్లారా అంటూ దుర్భాషలాడి దాడి చేశారు. దాడిలో శశికిరణ్, మాణిక్యరావు, కర్రిరాజశేఖర్, వలపర్ల భాను, కర్రి మహాలక్ష్మి, కొత్తకర్ర కుమారి, గాయపడగా జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్నారు. దీనిపై జీజీహెచ్‌లో అవుట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

కేఎల్‌యూలో అంతర్జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలనలో ప్రో చాన్సలర్ డాక్టర్ కె.ఎస్ జగన్నాధరావు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కె.ఎల్ యూనివర్శిటీలోని కె.ఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. సదస్సును వర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ కె.ఎస్ జగన్నాధరావు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, లైఫ్ సైన్స్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ ఎన్.బుచ్చినాయుడులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.ఎస్. జగన్నాధరావు మాట్లాడుతూ.. కె.ఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఔషధ ఆవిష్కరణ, డెలివరీ, ప్రస్తుత ట్రెండ్స్‌పై అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ సంయుక్తంగా ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తోందన్నారు. కె.ఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు, పి.హెచ్.డి స్కాలర్‌లు, అధ్యాపకులు ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారని తెలిపారు. లక్నోకు చెందిన ప్రముఖ సి.డి.ఆర్.ఐ శాస్త్రవేత్త డాక్టర్ నరేందర్, ఐ.ఐ.టి ఇండోర్ నుంచి డాక్టర్ హేమచంద్ర ఝూలు సదస్సులో పాల్గొని ఔషధ ఆవిష్కరణ, అభివృద్ధి మరియు డెలివరీ టెక్నాలజీల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కె.ఎల్ ఫార్మసీ కళాశాల ఆచార్యులు డాక్టర్ మణికంఠ సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించగా వర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కె.ఆర్.ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

మంగళగిరి టౌన్: మే 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరిగే అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి యస్.కె. వలి పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని సి.పి.ఐ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల గోడ ప్రతులను ఆవిష్కరించారు. వలి మాట్లాడుతూ.. దేశంలో యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాని మోడీ హామీ దశాబ్ద కాలంగా అమలుకు నోచుకోలేదన్నారు. కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలు, రాజకీయాలు ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవస్థకు దాసోహమై వారికి దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి జాలాది నవీన్, నియోజకవర్గ అధ్యక్షులు గోపిరాజు, నాయకులు జాలాది చైతన్య, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం



ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: పహల్గాం ప్రాంతంలో టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ముక్తకంఠంతో ప్రజలందరూ ఖండించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎం.టి.ఎం.సి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఉగ్రదాడిని ఖండిస్తూ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ప్రధాన రహదారి వెంట ఉగ్రదాడిని ఖండించాలని కోరుతూ నినాదాలు చేస్తూ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. సీపీఎం తాడేపల్లి మండల నాయకులు నల్లపు కిషోర్‌బాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి పల్లెకృష్ణ, సీపీఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు, నాయకులు అమ్మిశెట్టి సుధాకర్, తాడిశెట్టి శ్రీనివాసరావు, కాజా పెద్ద వెంకటేశ్వరరావు, సింగంశెట్టి రవికిషోర్, చుక్క మస్తాన్, కాజా శ్రీనివాసరావు, కొండపల్లి యశోద, మహేష్, గుణశేఖర్ పాల్గొన్నారు.

ఫిరంగిపురం: పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడుల్లో మృతిచెందిన వారికి మండల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి శుక్రవారం నివాళులర్పించారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో సీపీఎం మండల పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఆ పార్టీ మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, కె.శ్రీనివాసరావు, షేక్.హుస్సేన్, కె.కోటేశ్వరరావు, ఈ.నాగేశ్వరరావు, డి.సాయి పాల్గొన్నారు.

కార్మికుల దీక్షకు మద్దతు

తాడేపల్లి రూరల్: ఎ.సి.సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఎ.సి.సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షకు ఆయన నాయకులు కె.ఆదినారాయణతో మద్దతు తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమని అన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయశ్రీ, కాశమ్మ, ఇమాంబి, దుర్గా భవాని, శివకుమారి, సారమ్మ, అంకయ్య, గురవయ్య, హగ్గయ్య, నాగేశ్వరరావు, రమాదేవి, ఇశ్రాయేల్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులు

దుగ్గిరాల: పోప్ ఫ్రాన్సిస్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తూ కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. చిలువూరు గ్రామంలో శుక్రవారం ఆర్.సి.యం చర్చి ఫాదర్ యలమర్తి సురేష్ అధ్వర్యంలో విశ్వాసులు ర్యాలీ నిర్వహిస్తూ నివాళులు తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన బైబిల్ మిషన్ మహోత్సవాలు



దొంతిరెడ్డి వేమారెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

తాడేపల్లి రూరల్: క్రీస్తు మహిమలను వివరిస్తూ తాడేపల్లి రూరల్ చిర్రావూరు గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న బైబిల్ మిషన్ మహిమ జీవన మోక్ష మహోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ మహోత్సవానికి వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డి.వి.ఆర్) హాజరయ్యారు. వేమారెడ్డి మాట్లాడుతూ.. మనిషిని ప్రశాంతతవైపు నడిపిస్తున్నది సువార్తీకులేనని అన్నారు. ప్రపంచమంతా శాంతి సందేశాన్ని పంపి అందరినీ సన్మార్గంలో నడిపించేందుకు పాస్టర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ మహోత్సవంలో పాల్గొని క్రైస్తవులను సందేశాలు ఇచ్చిన పాస్టర్ ఇమ్మానియేల్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం దొంతిరెడ్డి వేమారెడ్డిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కాసినేడి బాజీ గంగాధర్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి భీమిరెడ్డి శరణ్‌కుమార్ రెడ్డి, నాయకులు జెట్టి కోటేశ్వరరావు, సాంబశివరావు, రాంబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి

ప్రత్తిపాడు: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కిట్స్ కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. 'ప్రపంచ మేథో సంపత్తి దినోత్సవం' సందర్భంగా ఈ నెల 24వ తేదీన ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఇన్నోవేషన్ విభాగం, ఏపీ ఉన్నత విద్యామండలి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రూసా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఏఎన్‌యూలో నిర్వహించిన నూతన ఆవిష్కరణల పోటీల్లో కిట్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా 250 ఆవిష్కరణలు పోటీల్లో పాల్గొనగా, 10 ఆవిష్కరణలు మాత్రమే తుది ఎంపికకు అర్హత సాధించాయి. వాటిలో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల రూపొందించిన హైబ్రిడ్ డ్రోన్ ఆవిష్కరణ మొదటి బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డా.పి.బాబు, అకాడమిక్ డైరెక్టర్ డా.కె.హరిబాబు, సీఎస్సీ విభాగాధిపతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో అడిషనల్ కమిషనర్ శకుంతల

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని అడిషనల్ కమిషనర్ శకుంతల సిబ్బందికి సూచించారు. మంగళగిరి నగర పరిధిలోని గాలిగోపురం వద్ద నుంచి మెయిన్‌బజార్, మిద్దె సెంటర్ వరకు శుక్రవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శకుంతల మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవడానికి కనీసం 500 ఏళ్లు పడుతుందని.. వర్షాలు పడితే నీటిలో కలసి పర్యావరణానికి హాని కలుగుతుందని అన్నారు. 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను నగరంలో వినియోగించడం, విక్రయించడం నిషేధమని.. ఎవరైనా ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలతో పాటు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇందు, పలు సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ సీఐగా వీరా నాయక్



పొన్నూరు: పట్టణ సీఐగా వీరా నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నగరంపాలెం స్టేషన్లో సీఐగా పని చేసి బదిలీపై పొన్నూరుకు వచ్చారు. ఇక్కడ పని చేసిన సీఐ రవికిరణ్ ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేసినట్లు తెలిసింది. పొన్నూరు పట్టణ సీఐగా పనిచేసిన రవికిరణ్ ఏడు నెలల్లోనే బదిలీ కావడం పట్టణంలో చర్చనీయాంశమయ్యింది.

ఇక ఐదు రోజులే గడువు..

ఐదు శాతం రాయితీకి అవకాశం

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించిన ఆస్తి పన్ను ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోగా ఏక మొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై ఐదు శాతం రాయితీ లభిస్తుందని, ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి ఏక మొత్తంగా చెల్లిస్తే వారికి వడ్డీపై 50 శాతం రాయితీని కూడా ఈ నెలాఖరులోపు చెల్లించి పొందవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నును ముందస్తుగా ఏక మొత్తంగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించిందని, ఈ నెల 30లోగా ఆస్తి పన్నుని ఏక మొత్తంగా చెల్లిస్తే పన్ను రాయితీ లభిస్తుందన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి ఏక మొత్తంగా చెల్లించే వారికి వడ్డీపై 50 శాతం రాయితీని కూడా ఈ నెలాఖరులోపు చెల్లించి పొందవచ్చన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 8, సర్కిల్ కార్యాలయంలోని 6 ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ప్రతి రోజు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.